సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 23 । జూలై । 2024



క్షణికావేశం..తీసింది ప్రాణం

క్షణికావేశంలో ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇద్దరూ పొన్నాడ పంచాయతీకి చెందిన వారే. - 8లో



సంక్షేమంలో సంక్షోభం

సంక్షేమ హాస్టళ్లలో సంక్షోభం నెలకొంది. విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు అందడం లేదు. - 8లో

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి సెప్టెంబర్ 16లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య సోమవారం ప్రకటనలో వెల్లడించారు. దరఖాస్తుదారులు ప్రస్తుత ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యా సంస్థలో ఈ ఏడాది 5వ తరగతి చదివి ఉండాలని వెల్లడించారు.

న్యూస్‌రీల్

ఎస్‌ఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైమ్: విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఉత్తర్వుల మేరకు జిల్లాకు చెందిన 20 మంది ఎస్‌ఐలను రేంజ్ పరిధిలో బదిలీ చేస్తున్నట్లు విశాఖ రేంజ్ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. రేంజ్ పెరగడంతో 20 మంది ఎస్‌ఐలను శ్రీకాకుళంకు అలాట్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు



ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతుల సమస్యలు తీర్చడానికి సమగ్ర సాయం అందిస్తామని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం డిగ్రీ, పీజీ చదువుతున్న విభిన్న ప్రతిభావంతులకు 8 ల్యాప్‌టాప్‌లు, రెండు సెల్‌ఫోన్లు, ఒక ట్రై సైకిల్‌ను జేసీ అందజేశారు. ఈ సందర్భంగా వారి చదువుల గురించి ఆరా తీశారు. ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లు ఇన్‌స్టాల్ చేసి ఉన్నామని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు కావాలంటే సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ, శ్రీకాకుళం కార్యాలయానికి ఆన్‌లైన్‌లో గానీ నేరుగా గానీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పీయూసీ ప్రవేశాలకు ఏర్పాట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్ ఎంపురం క్యాంపస్‌లో ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) మొదటి ఏడాది ప్రవేశాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో స్థానిక క్యాంపస్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ నెల 11న మెరిట్ లిస్ట్ సైతం విడుదల చేశారు. 1100 సీట్లకు 1110 సీట్లు కేటాయించారు. ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి ప్రవేశాలు కల్పిస్తారు. షెడ్యూల్ మేరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు.

ఏపీఈఏపీ సెట్ తుది విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీఈఏపీసెట్- 2024 ఎంపీసీ స్ట్రీమ్ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ విడుదల చేశాయి. ఈ మేరకు చివరి విడత కౌన్సెలింగ్‌కు గతంలో కౌన్సెలింగ్‌కు హాజరు కాని విద్యార్థులు, ప్రస్తుతం సీట్లు, కళాశాలలు లభించి మార్పు చేసుకునే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుంది. షెడ్యూల్ మేరకు మంగళవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లింపు, రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేసుకోవాల్సి ఉంటుంది. మంగళవారం నుంచి 26వ తేదీ వరకు ధృవీకరణ పత్రాలు అప్‌లోడ్ చేసుకోవాలి. 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఆప్షన్లు నమోదుకు అవకాశం ఉంటుంది. 27వ తేదీన ఆప్షన్లు మార్పులు చేసుకోవచ్చు. 30వ తేదీన సీట్ల అలాట్‌మెంట్లు ప్రకటిస్తారు. జూలై 31వ తేదీ నుంచి ఆగస్టు మూడు మధ్య కళాశాలలకు సెల్ఫ్ రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో 659 హెక్టార్లలో వరి పంటకు నష్టం



రావిచంద్రి వద్ద పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, కొత్తూరు ఏడీఏ

ఎల్‌ఎన్‌పేట: తుఫాన్ కారణంగా జిల్లాలో 659 హెక్టార్లలో వరి పంటకు నష్టం జరిగిందని కొత్తూరు వ్యవసాయ శాఖ ఏడీఏ బొడ్డేపల్లి రాజగోపాల్, ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, రాగోలు రైతు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు జి.చిట్టిబాబు, ఎస్.నీలవేణి, కె.మధు తెలిపారు. మండలంలోని కోవిలాం, రావిచంద్రి, తురకపేట, ధనుకువా డ గ్రామాల వద్ద నీట మునిగిన పంట పొలా లను సోమవారం పరిశీలించారు. జిల్లాలోని ఎల్.ఎన్.పేట మండలంలో 366 హెక్టార్లు, జలుమూరులో 160, గారలో 102, సారవకోటలో 25, హిరమండలం మండలంలో ఆరు హెక్టార్లలో వరి వెదలు వేసుకున్న పంట పొ లాలు నీట మునిగి పంట నష్టం జరిగినట్లు ప్రా థమిక అంచనాలు రూపొందించామన్నారు. రైతులకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. రైతులకు విత్తనాలతో పాటు నష్ట పరిహారం ఇవ్వాలని నివేదించామన్నారు.

నిన్నటి ప్రగతి ▶ సాగాలి శీఘ్రగతి



- ఎమ్మెల్యేలు అసెంబ్లీలో సమస్యలు ప్రస్తావించాలని జిల్లావాసుల ఆకాంక్ష
- గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని సూచన
- కీలక ప్రాజెక్టులు పూర్తి చేయాలని విన్నపం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

మూలపేట పోర్టు, వైఎస్సార్ సుజల ధార మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ పరిశోధన ఆస్పత్రి, బీఆర్ఏయూలో కొత్త భవనాలు, నేరడికి ప్రత్యా మ్నాయ చర్యలు.. వైఎస్సార్‌సీపీ హయాంలో జిల్లాలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు జరిగాయి. రెండేళ్లు కరోనాతో కాలం ఆగిపోయినా మిగిలిన మూడేళ్ల కాలంలోనే ఈ పనులన్నీ చేసింది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం కూడా పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు. జిల్లా భవితవ్యాన్ని మార్చే కీలక ప్రాజెక్టుల విషయంలో స్థానిక ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో చొరవ చూపాలని ఆకాంక్షిస్తున్నారు.

మేజర్ ప్రాజెక్టులివే..



- వైఎస్సార్ సీపీ హయాంలోనే రూ.700కోట్లకు పైగా వ్యయంతో ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు నిర్మితమైంది. దాని ద్వారా నిర్దేశిత గ్రామాల్లో ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందేలా మరింత జాగ్రత్తగా నిర్వహణ చేయాల్సిన అవసరం ఉంది.
- ఇక జిల్లాకు జీవనాడి అయిన వంశధార ప్రాజెక్టులో భాగంగా నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు కారణంగా ప్రత్యామ్నాయంగా అప్పట్లో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మంజూరు చేశారు. రూ.176.35కోట్లు మంజూరు చేయడమే కాకుండా పనులు కూడా ప్రారంభించారు. దాన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపైనే ఉంది.






- వైఎస్ జగన్ హయాంలో కిడ్నీ రీసెర్చ్ కమ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పూర్తయ్యింది. ఇక్కడ అవసరమైన స్థాయిలో వైద్యులను నియమించి సకాలంలో సేవలందేలా చూడాలి.



- అలాగే గత ప్రభుత్వంలో మత్స్యకారుల కోసం రూ.365.81కోట్లతో ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ మొదలుపెట్టారు. వజ్రపుకొత్తూరు మండలంలోని మంచినీళ్లపేటలో రూ.11.95కోట్లతో జెట్టీ నిర్మా ణం కూడా ప్రారంభించారు. వీటిని పూర్తిచేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.
- విలేజ్ హెల్త్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలందించే అద్భుత కార్యక్రమం గత ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. ఉచితంగా మందుల పంపిణీ, ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించడమే కాకుండా వారికి సర్జరీలు, ఉన్నత మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టింది. ఆ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలి.
- మత్స్యకారుల బతుకులు బాగు పడాలని మూలపేట పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టి.. పనులు వాయువేగంతో చేశారు. కరోనా అడ్డుపడినా ఆ తర్వాత నిర్వాసితులకు పరిహారాలన్నీ చెల్లించి చాలావరకు పనులు చేశారు. ఏకంగా రూ. 2,949.70 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది.



- ఆఫ్‌షోర్ నిర్మాణాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలి.
- శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు విస్తరణ పనుల్లో కొంతమేర మిగిలి ఉంది. దాన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత ఇప్పుడున్న పాలకులపైనే ఉంది. కోడి రామ్మూర్తి స్టేడి యం అభివృద్ధికి గత ప్రభుత్వమే నిధులు మంజూ రు చేసి పనులకు శ్రీకారం చుట్టింది. ఆ పనులు పూర్తి చేస్తే క్రీడాకారులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది.



- కొత్త కలెక్టరేట్ భవనం నిర్మాణం పూర్తి చేసేందుకు రూ. 116.5కోట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ఫినిషింగ్ వర్క్స్ మాత్రమే మిగిలి ఉన్నాయి. అవి పూర్తి చేసి ప్రారంభించే బాధ్యత తీసుకోవాలి.

విద్యా రంగంలో..




వైఎస్సార్ కలల విద్యా సంస్థ ట్రిపుల్ ఐటీలో వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.131కోట్లతో జీప్లస్5 బ్లాక్‌లను మూడు నిర్మించింది. మరో రూ.67కోట్లతో న్యూ అకాడమీ బ్లాక్‌ను నిర్మిస్తూ వస్తోంది. ఈ మిగిలిన పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. అదే విధంగా మరో రూ.133కోట్లతో 6వేల మందికి సరిపడా వసతి ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పుడా పనులు పూర్తి చేసి, 6,600మందికి పూర్తి స్థాయిలో వసతి ఉండేలా బాధ్యత తీసుకోవాల్సి ఉంది.

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రూ. 45కోట్లతో పలు భవనాల నిర్మాణాలు చేపట్టింది. పెండింగ్‌లో ఉన్న పనులను ప్రస్తుత పాలకులు పూర్తి చేయాల్సి ఉంది.
- వైఎస్ జగన్ ప్రభుత్వం మంజూరు చేసిన వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాల, అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల, హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లకు పక్కా భవనాలు నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలి.



- జిల్లాలో గత ప్రభుత్వం నాడు-నేడు మొదటి ఫేజ్ కింద రూ.286.22కోట్లతో 1247 పాఠశాలలను సుందరంగా తీర్చి దిద్ది, మౌలిక సదుపాయాలను కల్పించింది. రెండో ఫేజ్ కింద రూ. 427.73కోట్లతో పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, వసతి గృహాలను బాగు చేసింది. ఇప్పుడా విద్యాలయాల నిర్వహణ సరిగా చేయాల్సిన అవసరం ఉంది.



- పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు గత ప్రభుత్వం సుమారు రూ. 226కోట్లతో శ్రీకారం చుట్టిన పనులను ముందుకు తీసుకెళ్లాలి.

మీ కోసంలో 151 అర్జీల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో 151 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, డీఆర్డీఏ పీడీ కిరణ్, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర రావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అర్జీల స్వీకరణ కార్యక్రమానికి ముందుగా జిల్లాలో గత నాలుగు రోజులనుండి పడిన భారీ వర్షాలకు శాఖల వారీగా ఏర్పడిన నష్టాలపై సంబంధిత శాఖలైన వ్యవసాయ, మత్స్య, రహదారులు భవనాలు, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ఆరా తీశారు. కార్యక్రమంలో కేఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శనదొర, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టిరాజు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, జిల్లా ఉద్యాన అధికారి ఆర్‌వీ ప్రసాద రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందే

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తోందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం దుమ్మెత్తి పోశారు. ఆయన ఆమదాలవలసలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలు మీరు ఇచ్చిన మేనిఫెస్టోని నమ్మి ఓట్లు వేసి గెలిపించారని, ఆ హామీలను అమలు చేసి ప్రజలకు మేలు చేయాలని ఆయన కోరారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కులం మతం పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందించారన్నారు. 99 శాతం హామీలు అమలు చేసిన మొనగాడు జగన్ అని అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని ఎరువులు విత్తనాలను కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందించలేదని, వచ్చిన అరకొర విత్తనాలు ఎరువులు స్థానిక నాయకుల ఇళ్లల్లో వేసుకొని పసుపు కండువా వేసుకున్న వారికి అందిస్తున్నారని విమర్శించారు. రైతుకు అందాల్సిన పంటసాయం అందలేదని గుర్తుచేశారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంత మంది పిల్లలకు రూ.15000 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఒక్కరికే ఇస్తామని ప్లేట్ ఫిరాయించడం జనమంతా చూస్తున్నారని తెలిపారు. సమావేశంలో పార్టీ మున్సిపల్ మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ శ్యామల రావు, పార్టీ రాష్ట్ర యువజన, విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

శ్రీకాకుళం క్రైమ్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసే బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో అర్జీదారుల నుంచి 55 ఫిర్యాదులు స్వీకరించారు.



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

ఎస్పీ వద్ద వృద్ధురాలి మొర..

తాను కొనుక్కున్న భూమిని కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారంటూ ఓ వృద్ధురాలు ఎస్పీ వద్ద మొర పెట్టుకున్నారు. శ్రీకాకుళం సమీపంలోని పెద్దపాడుకు చెందిన లండ సూరమ్మ గ్రీవెన్స్‌సెల్ బయట ఉండడంతో ఎస్పీ ఆమె వద్దకు వచ్చి మాట్లాడారు. ఏఎస్‌ఐ ఎల్‌వీ రాములు తన భర్త అని తాను వివాహానికి ముందు 22.5 సెంట్ల భూమిని కొనుగోలు చేశానని, తన భర్త రిటైరయ్యాక వచ్చిన సొమ్ముతో ఇల్లు కట్టుకుని మరో 22.5 సెంట్ల భూమిని కొన్నానని చెప్పారు. తన భర్త చనిపోవడంతో విశాఖలో ఉంటున్నానని, ఇక్కడ తన భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అదే గ్రామానికి చెందిన కలగ నర్సింగ్, అతని సోదరుడు, మరికొంతమందితో కలిసి తన భూమిలో చేయిస్తున్న పనులు అడ్డుకున్నారని ఫిర్యాదు చేశారు. ఇంటి వద్దకు వచ్చి బెదిరింపులతో పాటు దాడికి యత్నించడంతో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయినా వారి బెదిరింపులు ఆగడం లేదని చెప్పారు. వెంటనే స్పందించిన ఎస్పీ ఎస్‌ఐతో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదులు

శ్రీకాకుళం క్రైమ్ : ఉద్యోగాలు, బదిలీల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన మందస మండలం లోహరిబంద పంచాయతీ కార్యదర్శి మన్నం సతీష్ బాబుపై కలెక్టర్, ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి.దాదాపు తొమ్మిది మంది బాధితులు ఫిర్యాదులు చేశారు. తమకు కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్లుగా, యూనియన్ బ్యాంకులో మెసెంజర్లుగా, ట్రెజరీలో కూడా ఉద్యోగాలిప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకున్నాడని వారంతా ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళానికి చెందిన తమ్మి నేని సాయి నుంచి రూ. 13.50 లక్షలు, పిళ్లా నరేష్‌కుమార్ నుంచి ఫోన్‌పే ద్వారా రూ. 5.11లక్షలు, ఓ ప్రభుత్వ ఉపాధ్యాయు డిని బదిలీ చేస్తానని నమ్మించి రూ. 5.50 లక్షలు, హుద్‌హుద్ తుఫాను బాధితురాలు జయలక్ష్మికి (నర్సన్నపేట) ఇల్లు ఇప్పిస్తానని రూ. 4లక్షలు, శ్రీకాకుళం శ్రీనివాస నగర్‌కాలనీ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ నుంచి రూ.1.30 లక్షలు తీసుకున్నాడని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. అలాగే టెక్కలికి చెందిన మార్త (నీల య్య) రూ. 6 లక్షలు, దువ్వాడ భాగ్యరాజ్ రూ.6 లక్షలు, రణస్థలంకు చెందిన ఎం.కిరణ్ రూ.6 లక్షలు, శ్రీకాకుళంకు చెందిన ఈశ్వరి రూ. 8.50 లక్షలు ఇచ్చి మోసపోయామని ఎస్పీ కార్యాలయంలో విన్నవించారు. బాధితులు దాదాపు 70 మంది ఉండటమే కాక వారంతా కలిసి ఓ వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడి ఇలా ఫిర్యాదులు ఇవ్వడానికి ముందుకు వస్తున్నట్లు చెప్పారు. వీరందరి వద్ద సుమారు రూ. 13 కోట్ల వరకు తీసుకున్నట్లు సమాచారం. దీని పై స్పందించిన కలెక్టర్, ఎస్పీ 14రోజుల్లో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.







● మనమే బాని'సెల్' చేస్తున్నాం..

పిల్లలు కూడా సెల్‌ఫోన్లకు బానిసలైపోతున్నారు. ఇంట్లో చిన్నారులు అల్లరి చేస్తున్నారని, సీరియల్స్ చూస్తున్నప్పుడు ఇబ్బంది కలిగిస్తున్నారని, భోజనం తినడం లేదని, మితి మీరిన అల్లరి చేష్టలు చేస్తున్నారనే కారణాలతో చేతిలో సెల్ పెడుతున్నాం. ఈ పద్ధతి మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మితిమీరిన సెల్‌వినియోగం అనర్థాలకు దారి తీస్తుందని చెబుతున్నారు. - టెక్కలి



● కోవెలలో కొండచిలువ

రాజపురం రామ లింగేశ్వర ఆలయం (మఠం కోవెల)లో సోమవారం ఓ కొండ చిలువ ప్రత్యక్షమైంది. ఈ గుండి కొండ పక్కనే ఉంటుంది. ఇక్కడ పురాతన కాలంలో సర్పం తిరుగాడిన ఆనవాళ్లు కూడా కనిపిస్తాయి. కోవెలలో కొండ చిలువ కనిపించడంతో స్థానికులు ఆ సంగతులన్నీ గుర్తు చేసుకున్నారు. - కవిటి



● శిక్షా.. సప్తాహ్

జాతీయ విద్యా విధానం 4వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శిక్షా సప్తాహ్ జరుగుతోంది. అందులో భాగంగా చొట్రాయిపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు స్థానిక వనరులతో తయారు చేసిన అంకెలతో ఆటలు, భాగాహార యంత్రం, ఆరో హణ, అవరోహణ క్రమం, గణిత వైకుంఠపాళి, తెలుగులో గుణింతాల చట్రం తదితర బోధన సామగ్రిని ప్రదర్శించారు. - కంచిలి



● నిలకడగా వంశధార

హిరమండలం వంశధార గొట్టా బ్యారేజీ వద్ద వరద నీరు నిలకడగా ఉంది. అల్పపీడనం ప్రభావంతో ఒడిశా కేచ్‌మెంట్ ఏరియాలో గత వారం రోజులుగా పడుతున్న తేలికపాటి వర్షాలకు వంశధారలో వరదనీరు వచ్చి చేరుతోంది. గొట్టా బ్యారేజీ వద్ద 38.10 మీటర్ల నీటిమట్టం ఉంది. బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 5943 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతోంది. నీటిని స్పిల్‌వే తోపాటు ఆరు గేట్లు 20 సెంటీమీటర్ల పైకి ఎత్తి దిగువ నదిలోకి (అవుట్‌ఫ్లో) 4332క్యూసెక్కులు నీటిని విడిచిపెట్టినట్లు డీఈ రంగనాయకులు తెలిపారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1261 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువ ద్వారా 350 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టినట్లు డీఈ చెప్పారు. - హిరమండలం



● విత్తనాల బంతి

ఆర్ట్ ఆఫ్ లివింగ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా న్యూకాలనీలోని ఓ పాఠశాల విద్యార్థులు రెండు వేల విత్తన బంతులను సోమవారం తయారు చేశారు. పర్యావరణ సమతుల్యత, మొక్కల పెంపకం, పచ్చదనం ప్రాముఖ్యతలపై విద్యార్థి దశ నుంచే పిల్లలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రకృతి వ్యవసాయ విభాగం కోఆర్డినేటర్ దార్లపూడి రవి తెలిపారు. - శ్రీకాకుళం కల్చరల్

క్లుప్తంగా

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం


వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించిన డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు సోమవారం నగరంలోని వన్ స్టాప్ సెంటర్, బాలసదన్, శిశు గృహాలను సందర్శించారు. లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాలసదన్‌లో పరిస్థితులు తెలుసుకుని పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలని సూచించారు.

చెన్నాపురంలో ఇసుక ట్రాక్టర్ సీజ్


సీజ్ చేసిన ట్రాక్టర్

నరసన్నపేట: మండలంలోని చెన్నాపురం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సోమవారం పట్టుకొని ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ సతీష్ కుమార్ తెలిపారు. ఎస్ఈబీ సిబ్బంది తనిఖీల్లో భాగంగా ఇసుకతో ఉన్న ట్రాక్టర్ పట్టుబడగా రికార్డులు పరిశీలించామని, ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసి నరసన్నపేట పోలీసులకు అప్పగించామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, రవాణా చేయకూడదన్నారు.

24న తలనీలాల వేలం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి చెందిన కేశఖండన శాలలో తలనీలాల పోగుల హక్కుల కోసం ఈనెల 24న ఉదయం 11 గంటలకు ఆరోసారిగా టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లుగా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ ఏడాది జనవరి 3 నుంచి నేటి వరకు తాజాగా పోగు చేసిన తలనీలాలను కూడా ఇదే రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు వేలం వేస్తున్నట్లుగా ఆయన ప్రకటించారు.

28 నుంచి ఆల్ ఇండియా డ్యాన్స్ ఆన్‌లైన్ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ (విశాఖ) ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ నుంచి ఆల్ ఇండియా ఆన్‌లైన్ డ్యాన్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆర్.జానకి ఓ ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని సంప్రదాయాల నృత్య కళాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో 'దేశభక్తి' అంశంతో కూడిన బృంద నృత్యాలతో పాటు జానపద, శాస్త్రీయ నృత్యాలలో డ్యూయట్ గ్రూపు విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. జూనియర్స్, సీనియర్స్ బృంద విభాగంలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.50వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25 వేలు, తృతీయ బహుమతిగా రూ.15వేలు ట్రోఫీతో పాటు అందిస్తామన్నారు. ఈ పోటీల్లో 10 నుంచి 15ఏళ్ల లోపు వారు జూనియర్స్‌గా, 16ఏళ్లు పైబడిన వారిని సీనియర్స్‌గా పరిగణిస్తామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలు, నృత్యాలయాలు, సాంస్కృతిక సంస్థలకు చెందిన కళాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఫైనల్స్ విజేతలకు 'వికసిత భారత్ నృత్య ట్రోఫీ-2024' లతో పాటు నగదు ప్రోత్సాహకాలను ప్రముఖుల చేతుల మీదుగా అందజేస్తామని అన్నారు. ఆసక్తి గల వారు 8522990123 నంబర్‌కు ఫోన్‌లో ముందుగా సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

'సంక్షేమం'లో సంక్షోభం

- బీసీ, సాంఘిక సంక్షేమ వసతి గృహాలపై పర్యవేక్షణ కరువు
- పట్టించుకోని ప్రభుత్వం
- మెనూ, కాస్మొటిక్ చార్జీల విషయంలో విద్యార్థుల ఇక్కట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర పేద వర్గాల పిల్లలు చదువుతున్న సంక్షేమ వసతి గృహాలపై కొత్త ప్రభుత్వం శీతకన్ను వేస్తోంది. వీరి చదువులకు ఆధారమైన సదుపాయాలను కల్పించడంలో విఫలమవుతోంది. మెనూ పాటించకపోవడం, వసతులు కల్పించకపోవడం, కాస్మొటిక్ చార్జీలు చెల్లించకపోవడం, అధికారులు పర్యవేక్షించకపోవడంతో ఈ హాస్టళ్లలో విద్యార్థులు దయనీయంగా కాలం గడుపుతున్నారు.

నెలన్నర దాటినా..

కొత్త ప్రభుత్వం వచ్చి 40 రోజులు గడిచినా, ఈ శాఖలపై సంబంధిత మంత్రులు, అధికారులు మాట్లాడిన దాఖలాలు లేవు. దీంతో సంక్షేమాధికారులు వారి కార్యాలయాలకు పరిమితమై పేద విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారు. గత ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలకు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసింది. అప్పటికే శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మతు చేసింది. కొత్త భవనాలు నిర్మించి విద్యుదీకరణ, తాగునీరు, మరుగుదొడ్ల ఆధునికీకరణ వంటి చర్యలు చేపట్టింది. కానీ ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభం నుంచీ రోజురోజుకూ నీరసమే కనిపిస్తోంది.

నిర్లక్ష్యం ప్రస్ఫుటం

జిల్లాలో ఎక్కువ శాతం మంది పేద విద్యార్థులు బీసీ సంక్షేమ వసతి గృహాలపైనే ఆధారపడి చదువుకుంటున్నారు. కానీ ఈ ఏడాది హాస్టల్‌కు వెళ్లేందుకు విద్యార్థులు ఒప్పుకోవడం లేదు. విద్యార్థులను సేకరించడం, వారి తల్లితండ్రులకు భరోసా కల్పించడంలో వసతి గృహ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. పోస్టుమెట్రిక్ కొంత మెరుగ్గా ఉన్నా ప్రీమెట్రిక్‌లో అధ్వాన పరిస్థితులు నెలకొని ఉన్నాయి.

జిల్లాలో బీసీ సంక్షేమ వసతి గృహాలు ప్రీమెట్రిక్‌లో 63 ఉన్నాయి. వీటిలో 7420 మంది చదువుకునేందుకు అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం ఈ 63 ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో కేవలం 4741 మంది ఉన్నారు. అంటే 60 శాతం మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పోస్టుమెట్రిక్‌లో ఉన్న 18 సంక్షేమ వసతి గృహాల్లో 1800 మంది ఇంటర్ నుంచి పీజీ వరకు విద్యార్థులు ఉండేందుకు అవకాశం ఉంది. వీటిలో ప్రస్తుతం 1751 మంది ఉన్నారు. ఇక సాంఘిక సంక్షేమంలో కూడా ఇదే తీరు కనిపిస్తోంది.

మూడేళ్ల కిందట నాటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యార్థులకు మెరుగైన మెనూను అందజేయాలని ఆదేశించారు. అలాగే కాస్మొటిక్ చార్జీలు తల్లి ఖాతాకు, ప్రతి నెల పిల్లలకు అందజేసే కార్యక్రమం తీసుకువచ్చారు. తరగతుల వారీగా తల్లి బ్యాంకు ఖాతాలకు ప్రతి నెల రూ.1150 నుంచి రూ.1600 వరకు సాయం అందించేవారు. అంతే కాకుండా పిల్లలకు 3 నుంచి పీజీ వరకు తరగతిని బట్టి రూ.125 నుంచి రూ.250 వరకు అదనంగా అందజేసేవారు.

కానీ ప్రస్తుత ప్రభుత్వం కాస్మొటిక్ చార్జీలు పెంచలేదు. పెరుగుతున్న ధరలు, అవసరాలకు అనుగుణంగా పెంపు చేయాల్సింది. అయితే ఆ పరిస్థితి లేదు. పిల్లలకు అందించాల్సిన బెడ్ షీట్, బ్లాంకెట్‌లు కూడా పాత విద్యార్థులకు తప్ప కొత్త విద్యార్థులకు అందించే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ ఏడాది సంక్షేమంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్పష్టంగా తెలుస్తోంది.

సమీక్షలేవీ..?

ఏటా వసతి గృహాలు పునఃప్రారంభం తర్వాత అంటే జూన్ నెలలో మెనూపై సంక్షేమాధికారులు సమీక్షించి, అవసరం మేరకు మార్పులు, చేర్పులు చేసి, ఉన్నతాధికారుల అనుమతిని తీసుకోవాలి. అయితే ఈ ఏడాది జిల్లాలోని బీసీ, సాంఘిక సంక్షేమాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. మెనూ పెంచేందుకు, లేదా మార్పులు చేసేందుకు ఎలాంటి సూచనలు తీసుకోలేదు. దీంతో పాత మెనూనే కొనసాగిస్తున్నారు. ఈ శాఖను అభివృద్ధి చేయడం, పేద విద్యార్థులకు సంక్షేమం అందజేయాల్సిన కొత్త ప్రభుత్వం వీరి సంక్షేమం విషయంలో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది.

సమావేశం నిర్వహించాలి

ఏటా అకడమిక్ ఇయర్ ప్రారంభం తర్వాత మెనూపై సమావేశం నిర్వహించి, మారుతున్న, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మార్చాలి. అయితే ఇప్పటి వరకు డైరెక్టరేట్ నుంచి మార్గదర్శకాలు రాలేదు. వచ్చిన వెంటనే నిర్ణయం తీసుకుంటాం.

– ఇ.అనురాధ, డీబీసీ, శ్రీకాకుళం

వరదలపై అప్రమత్తత అవసరం: కలెక్టర్


సమీక్షలో పాల్గొన్న అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఒడిశాలో భారీగా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి నాగావళి, వంశధార నదులకు వచ్చి చేరుతున్న వరద నీటిపై ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలసి సోమవారం సాయంత్రం ఆయన జిల్లాలోని పలు ముఖ్య శాఖల అధికారులతో తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన జిల్లాతో పాటు ఒడిశా రాష్ట్రంలో మన జిల్లాలో ప్రవహించే నదుల క్యాచ్‌మెంటు ప్రాంతాల్లో భారీగా వానలు కురుస్తున్నాయని, వర్షాలతో నదీ ప్రవాహం ప్రమాద స్థాయిని దాటితే గొట్టా వద్ద గేట్లను ఎత్తడానికి తగిన ఏర్పాట్లతో అధికారులు సిద్ధంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను, అధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రధాన నదుల వరద నీటిని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని ఆదేశించారు. వర్షానికి దెబ్బతిన్న రోడ్లకు సంబంధించిన నివేదిక అందజేయాలని ఆర్ అండ్ బీ ఎస్ఈ జాన్ సుధాకర్‌ను ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలపై మాట్లాడుతూ ఎల్ఎన్ పేట తురకలకోట వద్ద కాజ్ వే దెబ్బతిన్న కారణంగా వంశధార నీరు 150 ఎకరాల్లో పంటను ముంచెత్తిందని, దీనిపై స్థానిక తహసీల్దార్‌తో కలసి వ్యవసాయ, వంశధార శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందజేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.శ్రీధర్‌కు సూచించారు. జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న పారిశుద్ధ్య నిర్వహణపై జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావును ప్రశ్నించారు. సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా టైఫాయిడ్ జ్వరాలపై డీఎంహెచ్ఓ మీనాక్షిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన వన శాఖ, జిల్లా అటవీ శాఖల అధికారులతో తాజా పరిస్థితిని గురించి అడిగారు.

వంశధార కాలువ గండిని పూడ్చేందుకు చర్యలు


వంశధార 7ఎల్ కాలువ గండిని పరిశీలిస్తున్న జేఈ శ్రీనివాసరావు

ఎల్ఎన్ పేట: వంశధార కుడి ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న 7 ఎల్ కాలువకు పడిన గండిని పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని వంశధార జేఈ తాడి శ్రీనివాసరావు తెలిపారు. కాలువకు పడిన గండిని సోమవారం ఆయన పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువకు గండి పడిందన్నారు. ప్రస్తుతం కాలువ ద్వారా సాగునీటి ప్రవాహాన్ని నిలిపివేసినట్లు తెలిపారు. గండి పడిన విషయాన్ని పై అధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు. అధికారుల సూచనలు మేరకు గండిని పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఆయనతో పాటు స్థానిక టీడీపీ నాయకులు నడిపల్లి నారాయణరావు ఉన్నారు.

తడిచిముద్దయిన ఉద్దానం


కపాసుకుద్ది రెవెన్యూలో వర్షంతో చెరువుల్లా పంట పొలాలు

కవిటి: కవిటి ఉద్దానంతో పాటు పలాస డివిజన్‌లోని పలు మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ డివిజన్‌లో అన్ని ప్రాంతాలు కలుపుకుని 207.4 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. వేకువ జామున నాలుగు గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. కవిటిలో 56.8 మిల్లీమీటర్లు, కంచిలిలో 42.2, సోంపేటలో 42.4, నందిగాం మండలంలో 1.6, పలాసలో 15.4, మందసలో 21.2, వజ్రపుకొత్తూరులో 8.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు కవిటి మండలంలో 72.6 మిల్లీమీటర్లు వర్షం కురిసింది.

క్షణికావేశం.. తీసింది ప్రాణం


సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ చిరంజీవి

బయటకు వెళ్లిన తల్లి ఇంటికొచ్చి తలుపులు తెరిచే సరికి కొడుకు ఉరికి వేలాడుతూ కనిపిస్తే..? అమ్మమ్మ ఇంటికి వెళ్లిన బిడ్డ ఉరి పోసుకున్నాడని అమ్మకు కబురు అందితే..? ఎంత విషాదమో కదా. ఎచ్చెర్ల మండలం పొన్నాడ పంచాయతీ పరిధిలో గుండెలవిసిపోయే ఈ రెండు ఘటనలు చోటు చేసుకున్నాయి. క్షణికావేశం ఇద్దరు యువకులను బలి తీసుకుంది. తల్లిదండ్రులు మందలించారని ఒకరు బలవన్మరణానికి పాల్పడితే, సెల్‌ఫోన్ చూడొద్దు అన్నందుకు ఇంకొకరు ఊపిరి తీసుకున్నారు. ఇంత చిన్న కారణాలకు వీరు ప్రాణాలు తీసుకోవడంతో తల్లిదండ్రులు గుండె నీరయ్యేలా రోదిస్తున్నారు.

సెల్ ఫోన్ చూడొద్దు అన్నందుకు


గురుగు పవన్ కుమార్ (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ రాజీవ్‌నగర్‌కు చెందిన ఇంటర్ ద్వితీయ ఏడాది విద్యార్థి గరుగు పవన్‌కుమార్ (17) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ యువకుడు శ్రీకాకుళం పట్టణంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. పవన్ ఎక్కువగా సెల్ చూస్తుంటాడు. ఆ ప్రభావం చదువుపై పడడంతో తల్లిదండ్రులు సెల్‌ఫోన్ చూడవద్దని మందలిస్తూ చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థి ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరి పోసుకున్నాడు. తల్లి సత్యవతి ఇంటికి వచ్చి తలుపులు తీసే సమయానికి కొడుకు ఉరికి వేలాడుతూ కనిపించడంతో ఆమె నిశ్చేష్టురాలైంది. స్థానికుల సాయంతో కిందకు దించి చూడగా అప్పటికే చనిపోయి ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చిరంజీవి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. తండ్రి నరసింహాచారి కార్పెంటరీ పని చేస్తుంటాడు. కొడుకు మృతితో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

తల్లిదండ్రులు మందలించారని..


సాయికుమార్ (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ పంచిరెడ్డి పేట గ్రామానికి చెందిన చదువుల సాయికుమార్ (19) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ విద్యార్థి ఇంటర్ చదివి ఫెయిలయ్యాడు. తర్వాత శ్రీకాకుళం పట్టణంలోని కోట దుర్గ ప్రైవేట్ ఐటీఐలో చేరాడు. ఇప్పుడు రెండో ఏడాది. కానీ ఇటీవల కాలేజీకి హాజరు కాకపోతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఇదే పంచాయతీకి చెందిన ముద్దాడపేటలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లిపోయాడు. అక్కడ ఇంటిలో ఎవరూ లేని సమయం చూసి ఈ నెల 12న ఫ్యాన్ హుక్‌కు తాడుతో ఉరి పోసుకున్నాడు. స్థానికులు అతడిని గమనించి కిందకు దించి 108 సాయంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. కానీ పరిస్థితి విషమంగా ఉండడంతో రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ యువకుడు సోమవారం మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం మృత దేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుని తండ్రి ప్రసాద్ స్థానిక పరిశ్రమలో కాంట్రాక్టర్ వద్ద కార్మికునిగా పనిచేస్తున్నారు. తల్లి కల్యాణి గృహిణి. కుమారుని మృతిని తట్టుకోలేక తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. చేతికందిన కుమారుని మృతిని జీర్ణించుకోలేకపోతున్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాననీటి నిల్వతో ఇబ్బంది



ముక్తాపురం పాఠశాల రహదారిలో నీరు నిల్వ ఉండటంతో అవస్థలు పడుతున్న విద్యార్థులు

మెళియాపుట్టి: మండలంలోని ముక్తాపురం గ్రామంలో ఎంపీయూపీ పాఠశాలకు, ఆలయానికి వెళ్లే మార్గంలో వాన నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. గత కొద్ది రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు ఆ రహదార్పిడనీటి నిల్వ ఉండటంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అమర జవాన్లకు నివాళి


టెక్కలిలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న ప్రజా కళా సమితి సభ్యులు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు

టెక్కలి: ఇటీవల ఉగ్రదాడుల్లో అమరులైన జవాన్లకు సోమవారం రాత్రి టెక్కలిలో ఘనంగా నివాళులు అర్పించారు. సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర గ్రామానికి చెందిన వీర నాయక్ డొక్కరి రాజేష్, నందిగాం మండలం వల్లభరాయుడుపాడు గ్రామానికి చెందిన హవల్దార్ సనపల జగదీశ్వర రావు ఇటీవల ఉగ్రదాడిలో మృతి చెందడంతో.. దేశ రక్షణలో వారి ప్రాణ త్యాగాలను గుర్తు చేస్తూ పట్టణానికి చెందిన ప్రజా చైతన్య కళా సమితి, విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్ నుంచి వైఎస్సార్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు.

విద్యుత్ షాక్‌తో పంపు ఆపరేటర్ మృతి


మృతిచెందిన పంపు ఆపరేటర్ అప్పలసూరి

శ్రీకాకుళం రూరల్: ప్రభుత్వానికి చెందిన పంపు రిపేర్ చేస్తూ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మునసబుపేటకు చెందిన ఎస్.అప్పలసూరి (42) అనే కాంట్రాక్టు ఉద్యోగి సింగుపురం సచివాలయ పరిధిలో పనిచేస్తున్నాడు. ఈ నెల 21న భార్య పిల్లలతో కలిసి మామిడివలసలోని అత్తవారింటికి వెళ్లి 22వ తేదీన సోమవారం విధుల్లో చేరాడు. మునసబుపేటలోని ఓ పంపు గత కొద్ది రోజులుగా పనిచేయకపోవడంతో స్థానికంగా గల మరో ఆపరేటర్ గుండ రామారావుతో కలిసి రిపేర్ పనులు మొదలు పెట్టాడు. పనిచేస్తుండగా షార్ట్ సర్క్యూట్ కావడంతో అప్పలసూరికి షాక్ కొట్టి కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అప్పలసూరి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.


రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

పొందూరు: పొందూరు రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. మృతుడి తల ఛిద్రం కావడంతో గుర్తు పట్టలేకుండా ఉందని చెప్పారు. మృతుని ఎడమ చేతిపై అమ్మ, నాన్న అని రాసి ఉందని, నీలం రంగు షర్టు, ముదురు నీలం రంగు ఫ్యాంటు ధరించినట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9493474582 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

టెక్కలి రూరల్: మండలంలోని నౌపడ ఆర్ఎస్ రైల్వే గేటు సమీపంలో సోమవారం ఉదయం రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. స్థానికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సోమవారం ఉదయం నౌపడ గేటు సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి రైలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని తెలిపారు. మృతుడిని టెక్కలి గొల్లవీధికి చెందిన పూసపెంటయ్య(52)గా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పూణేలో వలస కార్మికుడు మృతి


మామిడి కృష్ణారావు(ఫైల్)

కవిటి: మండలంలోని బెలగాం పంచాయితీ రాపాకపుట్టుగకు చెందిన మామిడి కృష్ణారావు(45) అనే వలసకార్మికుడు మహారాష్ట్రలోని పూణేలో అనారోగ్యంతో మృతి చెందినట్టు గ్రామస్తులకు సోమవారం సమాచారం అందింది. తన విధుల్లో భాగంగా డ్యూటీకి వెళ్లే క్రమంలో బీపీ ఒక్కసారిగా అధికం కావడంతో కుప్పకూలాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్టు గ్రామానికి సమాచారం వచ్చిందని తెలిపారు.

26న శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వర దేవాలయం హుండీ ఆదాయాన్ని ఈ నెల 26న దేవాలయ ఆవరణలో.. దేవదాయ శాఖ సిబ్బంది, అర్చకులు, గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించనున్నామని ఈఓ పి.ప్రభాకరరావు సోమవారం తెలిపారు. ఆసక్తి గల భక్తులు ఈ క్రతువులో పాల్గొనాలని ఆయన కోరారు.

కారు డ్రైవర్‌కు 9 నెలలు జైలు శిక్ష

నరసన్నపేట: నిర్లక్ష్యంగా కారు నడిపి 45 రోజుల బాలుడి మృతికి కారణమైన కారు డ్రైవర్ రౌతు రమణమూర్తికి 9 నెలల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ నరసన్నపేట కోర్టు సివిల్ జడ్జి సి.హరిప్రియ సోమవారం తీర్పు నిచ్చారు. మండల పరిధిలోని ఆర్అండ్‌బీ రహదారి పై కోమర్తి-లింగాలపాడుల మధ్య 2022 అక్టోబర్ నెల 7వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదం సంఘటనపై ఈ విధంగా తీర్పు నిచ్చారు. ఉర్లాం పీహెచ్‌సీకి వ్యాక్సినేషన్ కోసం బాలుడిని తీసుకువెళ్లి తిరిగి కోమర్తిలోని ఇంటికి తీసుకువస్తుండగా.. విశాఖ పట్నం మల్కాపురానికి చెందిన రైతు రమణమూర్తి ఏపీ 39 కెపీ6617 నంబరు గల కారుతో ఆటోను బలంగా ఢీకొన్నాడు. ప్రమాదంలో 45 రోజుల బాలుడు మృతి చెందగా మరో వ్యక్తికి చేయి విరిగింది. ఈ ప్రమాదంపై సింహాద్రి సారిమల్లా (బాలుడి తల్లి)నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసు విచారణ అనంతరం కారు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణంగా గుర్తించి జడ్జి సి.హరిప్రియ ఈ మేరకు తీర్పు నిచ్చారు.

స్థల వివాదంలో వ్యక్తికి జైలు శిక్ష

నందిగాం: మండలంలోని బోరుభద్రలో 2018లో జరిగిన స్థల వివాదంలో ఇప్పిలి ఢిల్లేశ్వరరావు అనే వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారని నందిగాం ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బోరుభద్రకు చెందిన ఇప్పిలి అప్పలస్వామి, పోలమ్మ దంపతులపై ఆదే గ్రామానికి చెందిన ఇప్పిలి ఢిల్లేశ్వరరావు, ఇప్పిలి లచ్చమ్మ, బొమ్మాళి హరి, బొమ్మాళి అప్పలస్వామి, బొమ్మాళి సాయమ్మ, బొమ్మాళి కమలమ్మ, బొమ్మాళి లచ్చులు గ్రామంలో ఒక స్థల వివాదంలో గొడవపడ్డారు. అప్పలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. సోమవారం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.హరిప్రియ వాదనలు విన్న టెక్కలి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్‌హెచ్ఆర్ చక్రవర్తి ఢిల్లేశ్వర రావుకు జైలు శిక్ష, రూ.1000 జరిమానా, మిగిలిన వారికి రూ. 1000 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

అక్కుపల్లి బీచ్‌లో మంచినీటి కుళాయిలు ధ్వంసం


ధ్వంసమైన మంచినీటి కుళాయిలు

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో ఆదివారం రాత్రి కొంత మంది ఆకతాయిలు మంచినీటి కుళాయిని ధ్వంసం చేశారు. పర్యాటకుల సౌకర్యార్థం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.2.50 లక్షలు జిల్లా పరిషత్ నిధులతో ఈ కుళాయిలను ఏర్పాటు చేశారు. వీటిని ధ్వంసం చేయడంపై గ్రామస్తులు, పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు కాపాడుకోవాలని, పోలీసులు దీనిపై విచారణ జరపాలని అక్కుపల్లి సర్పంచ్ లండ లోలాక్షి, వైఎస్సార్ సీపీ నాయకులు లండ రామలింగం కోరారు.